సాక్షి పెద్దపల్లి

గురువారం · 31 · జూలై · 2025



5న కలెక్టరేట్ ఎదుట ధర్నా

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఆగస్టు 5న ధర్నా నిర్వహిస్తామని ఉపాధ్యాయ నేతలు తెలిపారు. కలెక్టరేట్ వద్ద వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.



ఉపాధ్యాయులే మార్గదర్శకులు

జ్యోతినగర్: విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికల్లో పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.
పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వాసవీమాతకు అభిషేకాలు



పూజలు చేస్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో శ్రావణమాసం సందర్భంగా బుధవారం ప్రత్యేకపూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకాలు, పసుపుకొమ్ములతో కుంకుమ పూజలు చేశారు.

సింగరేణి ఆస్పత్రికి వైద్యనిపుణుల రాక

గోదావరిఖని: హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు వచ్చే నెల 3న గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి రానున్నట్లు ఆర్జీ –1 అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రోలజిస్ట్, యూరోలజీ నిపుణులు ఇందులో ఉంటారని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, వారికుటుంబ సభ్యులు ఈనెల 31 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు సింగరేణి ఏరియా ఆస్పత్రిలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

మంథని: రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న అన్నారు. బుధవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ కుడుదుల వెంకన్న, వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్‌రెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

స్కూల్ బస్సుల్లో సీసీ కెమెరాలు బిగించాలి



మాట్లాడుతున్న డీసీపీ కరుణాకర్

గోదావరిఖనిటౌన్: పాఠశాల, కళాశాల బస్సుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సూచించారు. నగరంలోని అడ్డగుంటపల్లిలో బుధవారం సబ్ డివిజన్‌లోని పాఠశాలు, కళాశాలల యజమానులు, బస్సు డ్రైవర్లతో సదస్సు నిర్వహించారు. డ్రైవర్లు పొరపాటు చేసినా స్కూల్ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. నైపుణ్యం కలిగిన డ్రైవర్లనే నియమించుకోవాలని యాజమాన్యాలకుసూచించారు. సీట్లకు సరిపడా విద్యార్థులనే తరలించాలని పేర్కొన్నారు. ఏసీపీ రమేశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాదరావు, రాజు, రాజేశ్వరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్సైలు రమేశ్, భూమేశ్, అనూష, ఉదయ్‌కిరణ్, సంధ్యారాణి, వెంకటేశ్, ప్రసాద్, శ్రీనివాస్, రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

నిరంతరం విషయ పరిజ్ఞానం నేర్చుకోవాలి



మాట్లాడుతున్న రమేశ్

రామగిరి(మంథని): లక్ష్యం, విజయం సాధించేందుకు విషయపరిజ్ఞానాన్ని నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని గ్లోబల్ స్పీకర్, కార్పొరేట్ ట్రెయినర్ వేముకంటి రమేశ్ అన్నారు. మంథని జేఎన్టీయూలో బీ టెక్ ఎ రివార్డింగ్ క్యారియర్ అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, సమయపాలన, మోటివేషన్ లాంటి అంశాలపై ఆయన సుదీర్ఘంగా వివరించారు. సబ్జెక్టుల పరిజ్ఞానం, జనరల్ స్టడీస్, ప్రొడక్ట్, మార్కెట్, మారుతున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. నిత్యం ఏదోఒక ఆట కనీసం గంటసేపైనా ఆడాలని, తద్వారానే శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో స్ట్రీట్‌బోర్డులు

- తొలిసారి ఏర్పాటుకు బల్దియా శ్రీకారం
- తొలగనున్న చిరునామా సమస్యలు
- రూ.50 లక్షలతో టెండర్ల ఆహ్వానం
- తొలివిడతలో 380 బోర్డులకు ఆర్డర్
- స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో చిరునామా తెలుసుకోవడం అంతసులువేమీకాదు. ఒకచోట నుంచి ఇంకోచోటకు వెళ్లాలన్నా.. కొత్తవారు పలానా ప్రదేశానికి పోవాలన్నా ప్రయాసే.. ఇట్లాంటి ఈ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించేందుకు రామగుండం బల్దియా అధికారులు తొలిసారి స్ట్రీట్ సైన్ బోర్డుల(వీధి సూచిక బోర్డు) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని మొత్తం 60 డివిజన్‌లలో కొత్తగా స్ట్రీట్‌సైన్ బోర్డులు ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూందించారు. ఇటీవల నగరంలో 50 డివిజన్ల నుంచి 60 డివిజన్లకు పెంచుతూ పునర్విభజన చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో కొత్త ప్రాంతాలు, ప్రదేశాలు, కూడళ్లను తెలుసుకోవడం కష్టతరంగా మారింది. డివిజన్ల వారీగా ప్రజలు సులభంగా చిరునామా తెలుసుకునేలా స్టెయిన్‌లెస్ స్టీల్ మెటీరియల్‌తో స్ట్రీట్‌సైన్ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు.

రూ.50లక్షలతో టెండర్..

రామగుండం నగరంలో స్ట్రీట్‌సైన్ బోర్డుల ఏర్పాటుకు 20 రోజుల క్రితం రూ.50లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచిన అధికారులు.. ఓ కాంట్రాక్టర్‌కు పనులు కూడా అప్పగించారు. తొలివిడతలో మొత్తం 380 స్ట్రీట్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిని హైదరాబాద్‌లో తయారు చేయిస్తున్నారు.



నమూనా స్ట్రీట్ సైన్‌బోర్డు

తొలగనున్న సమస్యలు..

రామగుండం బల్దియాలోని 60 డివిజన్లలో తొలిసారి ఏర్పాటు చేయనున్న స్ట్రీట్‌సైన్ బోర్డులతో కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాలు, దిశలను తెలుసుకోవడం అందరికీ సులభతరం కానుంది. వేములవాడ మున్సిపాలిటీలో ఇప్పటికే ఏర్పాటు చేసిన రెండు రకాల స్ట్రీట్‌సైన్ బోర్డుల తరహాలోనే రామగుండంలోనూ ఏర్పాటు చేయడానికి డిజైన్లను ఎంపిక చేశారు. ఈస్ట్రీట్‌సైన్ బోర్డులతో ఏ డివిజన్ ఎక్కడుంటుంది? ఆ డివిజన్‌లో ఏ ప్రాంతం ఉందనే సమాచారం సులభంగా తెలుసుకోవచ్చు.

జంక్షన్లలో సైన్‌బోర్డులు..

ఒకటో డివిజన్ నుంచి 60వ డివిజన్ వరకు ఆయా డివిజన్ల పరిధిలోని వీధుల పేర్లు, కాలనీలు, ఇంటినంబర్లు, రోడ్డు నంబర్లు, కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాలు.. తదితర వివరాలను ఇప్పటికే బిల్‌కలెక్టర్ల ద్వారా బల్దియా టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సేకరించారు. ఒక్కోడివిజన్‌లో ఎక్కడెక్కడ సైన్ బోర్డులు పెట్టాలి? వాటిపై డివిజన్ల నంబర్లు, కాలనీల పేర్లతోపాటు ఎటువైపు ఏ ప్రాంతం ఉంటుందో తెలుసుకునేలా సూచికలు పొందుపర్చడానికి నివేదికలను సైతం తయారు చేసినట్లు తెలిసింది. దీనిఆధారంగా స్టెయిన్‌లెస్ స్టీల్ మెటీరియల్‌తో స్ట్రీట్‌సైన్ బోర్డులను సిద్ధం చేస్తున్నారు.

చిరునామా తెలుసుకోవడం సులభం



కొత్తగా 60 డివిజన్లుగా ఏర్పడిన రామగుండం నగరంలో ప్రజలకు అడ్రస్ తెలుసుకోవడంలో ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో స్ట్రీట్ సైన్‌బోర్డులను ఏర్పాటు చేయిస్తున్నాం. కూడళ్లు, రోడ్లు, ముఖ్యమైన ప్రాంతాలు, ఇంటి నంబర్లను సైన్‌బోర్డులపై పొందుపరుస్తాం. 15రోజుల్లో సైన్‌బోర్డుల తయారీ పనులు పూర్తవుతాయి. వాటి ఏర్పాటులో సమస్యలు తలెత్తకుండా టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– అరుణశ్రీ, బల్దియా కమిషనర్, రామగుండం

3న ఎత్తిపోతల ప్రారంభం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్/బ్రహ్మణపల్లి శివారులో నిర్మించిన ఎత్తిపోతలను ప్రారంభించే విషయంపై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎత్తిపోతల ద్వారా పాలకుర్తి, అంతర్గాం మండలాల పరిధిలోని సుమారు 20వేల ఎకరాల ఆయకట్టులో రెండు పంటలకు సాగు నీరు అందుతుందని ఠాకూర్ తెలిపారు. ఆగస్టు 3న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్డీవో గంగయ్య, అంతర్గాం తహసీల్దార్ రవీందర్‌పటేల్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అంతర్గాం ఎస్సై వెంకటస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

జ్యోతినగర్/ఫెర్టిలైజర్‌సిటీ/పాలకుర్తి: విద్యార్థులు ఇష్టంతో చదవాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచించారు. సింగరేణి సీఎస్సార్ ద్వారా క్యూ ఆర్ కోడ్ ముద్రించిన బుక్స్‌ను టెన్త్‌క్లాస్ విద్యార్థులకు అందించి మాట్లాడారు. ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్, ఏసీపీ రమేశ్, ఎంఈవో మల్లేశం, హెచ్ఎం జయరాజ్ పాల్గొన్నారు. కాగా, గౌతమినగర్‌లోని ఓ స్కూల్‌ను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. పాలకుర్తి మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ వర్కర్స్ క్లబ్‌లో నిర్వహించగా, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హాజరయ్యారు.



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అందరికీ పౌష్టికాహారం

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీగర్భిణి, బాలింత పేరు కచ్చితంగా నమోదు చేసి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంక్షేమశాఖ పనితీరుపై సమీక్షించారు. ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్యం, ఎత్తు, బరువు తనిఖీ చేయాలన్నారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీడీపీవో, సూపర్‌వైజర్లు రోజూ కనీసం రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి వేణుగోపాల్‌రావు తదితరులు ఉన్నారు.

ఆగస్టు 10 కల్లా పనులు ప్రారంభించాలి

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆగస్టు 10 వరకు ప్రారంభించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పనితీరుపై ఆయన సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు ప్రతిపాదించాలని, స్థానిక ఎన్నికలు త్వరలో నిర్వహించే అవకాశం ఉన్నందున కోడ్‌కన్నా ముందే పనులు ప్రారంభించాలని సూచించారు. ఈఈ గిరీశ్‌బాబు, సీపీవో రవీందర్, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించే వరకూ పనులు సాగనివ్వం

మంథనిరూరల్: సింగరేణి ఓసీపీ- 3 విస్తరణ కోసం సర్వం కోల్పోతున్న తమకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించే వరకు పనులు సాగనివ్వమని అక్కెపల్లి గ్రామస్తులు హెచ్చరించారు. బుధవారం ఎల్ – 6 కాలువ కోసం సిద్దపల్లిలో సింగరేణి ఇళ్ల కూల్చివేత చేపట్టగా గ్రామస్తులు అడ్డుకున్నారు. 2015లో తమ గ్రామాన్ని స్వాధీనం చేసుకునేందుకు నిర్ణయిందని, పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తోందన్నారు. తొలిసారి చేపట్టిన సర్వే ఆధారంగా పరిహారం చెల్లించకుండా ప్రైవేటుగా సర్వే చేయించి సగం పరిహారమే ఇచ్చిందన్నారు. తాము కోర్టుకు వెళ్తే.. తొమ్మిదేళ్ల తర్వాత తమకు అనుకూలంగానే తీర్పు వచ్చిందని, ఏడాది గడిచినా సింగరేణి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పూర్తిపరిహారం చెల్లించే వరకు పనులను అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసిన స్థానిక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. పోలీసులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. స్థానిక నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తళుక్కుమన్న అనన్య



షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయరమణారావుతో సినీనటి అనన్య

పెద్దపల్లిరూరల్: సినీనటి అనన్య నాగళ్ల బుధవారం జిల్లా కేంద్రంలో సందడి చేశారు. మేన్‌రోడ్డులోని ఓ షాపింగ్‌మాల్‌ను స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ప్రారంభించారు. అనన్యను సమీపం నుంచి చూసేందుకు అభిమానులు, జనం ఎగబడ్డారు. బౌన్సర్లు కట్టడి చేశారు.

మధ్యవర్తిత్వంతో సమస్యల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత

పెద్దపల్లిరూరల్: చిన్నసమస్యలతో పంతాలు, పట్టింపులకు వెళ్లి వివాదాన్ని జటిలం చేసుకుని కోర్టుల వరకూ వెళ్లడం కన్నా మధ్యవర్తి సాయంతో అక్కడికక్కడే పరిష్కరించుకోవడం మేలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం మధ్యవర్తిత్వంపై నిర్వహించిన అవగాహన సదస్సులో జడ్జి మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి సునీత, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి స్వరూపరాణి, పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ తదితరులు 'మధ్యవర్తిత్వం' అంశానికి అనుకూలంగా సంతకాలు చేశారు. భార్యాభర్తలు చిన్న విషయాలకే పెద్దగొడవలు చేసుకుని విడిపోతున్నారని, అలాంటి సమస్యలను మధ్యవర్తి సమక్షంలో పరిష్కరించుకోవాలని జడ్జి సునీత సూచించారు. గతంలో తాను హైదరాబాద్‌లో పనిచేసినప్పుడు 32 జంటలకు ఇద్దరి అంగీకారంతో విడాకులు మంజూరు చేశానని జడ్జి సునీత గుర్తుచేశారు. విడిపోయిన భార్యాభర్తలు వేర్వేరుగా బాగానే ఉంటారని, కానీ వారిపిల్లల భవిష్యత్‌ను ఊహించడమే కష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి పంపకాల్లోనూ గజం స్థలం కోసం కూడా కోర్టుమెట్లెక్కిన వారుఉన్నారని, ఇలా చేయడంతో ఆర్థికంగా నష్టపోవడం, సమయం వృథా చేసుకోవడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదని తెలిపారు. న్యాయవాదులు కూడా మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారాన్ని ప్రోత్సహించాలని జడ్జి సూచించారు. పెద్దపల్లి బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, గవర్నమెంట్ ప్లీడర్ కిశోర్‌తోపాటు శ్రీధర్, రవీందర్, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

'గృహజ్యోతి'కి ఎడిట్ కష్టాలు

- ఆన్‌లైన్‌లో తప్పిదాలు
- యథేచ్ఛగా కరెంట్ బిల్లులు
- అయోమయంలో లబ్ధిదారులు

రామగిరి(రామగుండం): ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం(జీరో కరెంట్ బిల్) కొందరు అర్హులకు అందడం లేదు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే సమయంలో చోటుచేసుకున్న పొరపాట్లతో ఈ సమస్య తలెత్తింది. మరికొందరు వివిధ కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల నుంచి అధికారులు స్వీకరించిన దరఖాస్తులను ప్రజాపాలన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇలా నమోదు చేసే ప్రక్రియలో మీటర్ నంబర్లు తప్పుగా వేయడం, పథకానికి దరఖాస్తు చేసుకోలేదు(నాట్ అప్‌లెడ్) అని నమోదు చేయడంతో అర్హులైన పేదలు ఈ పథకానికి దూరమవుతున్నారు.

చేతులెత్తేస్తున్న అధికారులు

దరఖాస్తుదారులు మండల ప్రజాపరిషత్ కార్యాలయాలకు వెళ్లి ఎంపీడీవోల దృష్టికి సమస్య తీసుకెళ్లగా తమ చేతిలో ఏమీలేదంటున్నారు. ప్రజాపాలన ఆన్‌లైన్ పోర్టల్‌లో తమకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదని వారు చెబుతున్నారు. కొత్తగా కరెంట్ మీటర్ తీసుకున్న పేదలకు కూడా ఈ పథకం వర్తించడం లేదు.

అమలుకు నోచుకోని హామీ

దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అది క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. అర్హులైన పేదలు కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారడం తప్ప పరిష్కారం లభించడం లేదు. అధికారులు స్పందించి ప్రజాపాలన పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ ఇస్తేనే అర్హులైన పేదలకు ప్రభుత్వం అందించే పథకం వర్తిస్తుందని లబ్ధిదారులు కోరుతున్నారు.



ఆన్‌లైన్‌లో నాట్ అప్‌లోడ్‌గా చూపిస్తున్న దరఖాస్తు

అవస్థల ప్రయాణం

- రైల్వేగేట్ దాటేదెలా?
- సా.. గుతున్న వంతెన పనులు
- గుంతలమయమైన అప్రోచ్ రోడ్డు
- నరకం చూపుతున్న రాకపోకలు

పెద్దపల్లిరూరల్: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పెద్దపల్లి – కూనారం మధ్యలోని రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ కష్టాలు ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. దాదాపు మూడేళ్లుగా సా..గుతున్న రైల్వే వంతెన పనుల్లో మరింత వేగం పెంచితేనే అవస్థల ప్రయాణానికి ముగింపు ఉంటుందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి నుంచి కూనారం, కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి మీదుగా హుజూరాబాద్, హన్మకొండ, మంథని ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులకు ఈ మార్గం ఎంతో ప్రయోజనకరంగా ఉండేలా ప్రభుత్వం రైల్వే వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.



రైల్వే వంతెన పనుల శిలాఫలకం

రూ.119.50 కోట్లతో పనులు

పెద్దపల్లి – కూనారం మార్గంలోని 39వ నంబరు రైల్వే క్రాసింగ్‌గేట్ వద్ద వంతెన పనులను రూ.119.50 కోట్ల అంచనా వ్యయంతో 10 అక్టోబర్ 2022 న ప్రారంభించారు. నిర్మాణం ప్రారంభించి దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. ఇంక అసంపూర్తిగానే ఉంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో మరింత వేగం పెంచి వీలైనంత త్వరగా పూర్తిచేసి వంతెనను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.





పెద్దపల్లి - కూనారం రైల్వేక్రాసింగ్ గేటువద్ద అధ్వానంగా అప్రోచ్ రోడ్డు, నిలిచిన వాహనాలు

అప్రోచ్ రోడ్డుపై గుంతలు..

రైల్వేవంతెన పనులు చేపట్టిన ప్రాంతంలో వాహనాల రాకపోకల కోసం తాత్కాలికంగా మట్టితో నిర్మించిన రోడ్డు గుంతలమయమైంది. ప్రస్తుతం వానలు కురుస్తుండడంతో నీళ్లుచేరి కుంటలను తలపిస్తున్నాయి. బురదమయమైన గుంతల రోడ్డుపై అవస్థల ప్రయాణం సాగించాల్సి వస్తోందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. గుంతలను గుర్తించక ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా లేకపోలేదు. అధికారులు స్పందించి కనీసం అప్రోచ్ రోడ్డుపై గుంతలు పూడ్చి వేయించాలని కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్ల రద్దీ

ఖాజీపేట – బల్హార్ష సెక్షన్‌లోని ప్రధాన రైలు మార్గం కావడంతో ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్ల రాకపోకలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతీ అరగంటకో రైలు వచ్చి పోతుండడం, ఒక్కోసారి వరుసగా రైళ్లు వస్తూ, పోతుండడంతో గంటల తరబడి గేట్ వేస్తున్నారు. దీంతో ట్రాక్‌కు ఇరువైపులా వాహనదారులు, ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తోంది. దాదాపు చివరిదశకు చేరిన రైలు వంతెన పను లను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రైల్వే వంతెన సమాచారం

నిర్మాణం స్థలం
39వ నంబరు రైల్వేగేట్

మార్గం : పెద్దపల్లి – కూనారం మధ్య

మంజూరైన నిధులు
రూ.119.50 కోట్లు

పనులు ప్రారంభమైన తేదీ
10 అక్టోబర్ 2022

పనులు పూర్తిచేయాలి



రైల్వే వంతెన పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలి. ఈ వంతెన వినియోగంలోకి వస్తేనే అందరికీ మేలు కలుగుతుంది. పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాలి.

– కనుకుంట్ల సదానందం, స్థానికుడు

జాప్యం ఎందుకో?



కేంద్ర ప్రభుత్వం ప్రజావసరాలను గుర్తించి రైల్వేవంతెన పనులకు నిధులు కేటాయించింది. మూడేళ్ల క్రితం మొదలైన పనులు పూర్తి కావడం లేదు. అధికారులు పనుల్లో వేగం పెంచేలా చూసి రైల్వేగేట్ కష్టాలు తీర్చాలి.

– జంగ చక్రధర్‌రెడ్డి, బీజేపీ నేత

వినియోగంలోకి తేవాలి



పెద్దపల్లి – కూనారం మధ్య చేపట్టిన రైల్వే వంతెన పనులు పూర్తయితేనే వాహనదారులు, ప్రజలకు మేలు కలుగుతుంది. పనులు దాదాపు చివరిదశకు వచ్చాయి. మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి.

– బొద్దుపల్లి శ్రీనివాస్, పెద్దపల్లి

ఓదెల మల్లన్న ఆలయ పాలకవర్గం ఖరారు

- 13 మంది డైరెక్టర్లతో జీవో జారీ

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం పాలకవర్గాన్ని 13 మంది డైరెక్టర్ల పేర్లతో ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో ఆర్టీ నంబరు 300ను బుధవారం విడుదల చేసింది. డైరెక్టర్లలో ఓదెల గ్రామానికి చెందిన చీకట్ల మొండయ్య, జంగం కొంరయ్య, కొదాటి మనోహర్‌రావు, జీలుక రవీందర్, కట్కూరి సమ్మిరెడ్డి, కొండ శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్, నాగపూరి రవి, తీర్థాల రాజారాం, ఈరవేని రవి, ఉప్పుల శ్రావణ్‌కుమార్, గంట రమేశ్, సామల యమున ఉన్నారు. ఈ సందర్భంగా చీకట్ల మొండయ్య ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి స్వామివారి సన్నిధిలో ప్రత్యేకపూజలు చేశారు. కాగా, కమిటీ చైర్మన్‌గా చీకట్ల మొండయ్య పేరు ఖరారైనట్లు సమాచారం. కొత్త మార్కెట్ కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

క్లుప్తంగా

సౌదీలో భూషణరావుపేట యువకుడు ఆత్మహత్య


సంగెం వినోద్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన సంగెం వినోద్ (30) సౌదీ అరేబియా దేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన సంగెం గంగరాజం– సరోజన దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వినోద్ పెద్ద కుమారుడు. ఆయన కొంతకాలంగా గల్ఫ్ దేశం వెళ్లి వస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం సౌదీ వెళ్లాడు. ఈనెల 22న వినోద్ తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి వారు కుటుంబసభ్యులకు బుధవారం ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వినోద్‌కు ఇంకా పెళ్లి కాలేదు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని బంధువులు పేర్కొన్నారు. మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి పంపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మృతుడి బంధువులు కోరుతున్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

జగిత్యాలక్రైం: భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదుతోపాటు, రూ.2 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నారాయణ బుధవారం తీర్పునిచ్చారు. కోరుట్ల మండలం యెకిన్‌పూర్‌కు చెందిన ఎర్ర చంద్రయ్య, భార్య గంగరాజు కూలీలు. చంద్రయ్య మద్యానికి బానిసై గంగరాజుతోపాటు కొడుకును వేధించేవాడు. 2022 అక్టోబర్ 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో భార్యతో ఘర్షణ పడి ఆమెను హత్య చేసి.. ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని తీసుకుని మృతదేహాన్ని మూటకట్టి యెకిన్‌పూర్ శివారులో పడేశాడు. మృతురాలి కుమారుడు సుధీర్ ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసి చంద్రయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కోర్టులో సాక్షులను హాజరుపర్చారు. దీంతో చంద్రయ్యకు జడ్జి శిక్ష ఖరారు చేశారు.

హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థులు

- స్థానికులు పట్టుకుని తిరిగి అప్పగింత

మల్యాల: మండలకేంద్రం శివారులోని జగిత్యాల అర్బన్ గురుకులం విద్యార్థులు హాస్టల్ గోడ దూకి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురుకులాన్ని గతేడాది జగిత్యాల నుంచి మండలకేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తరలించారు. ప్రస్తుతం ఇక్కడ 6, 7, 8 తరగతుల విద్యార్థులు 40మంది ఉన్నారు. ఈ ఏడాది అడ్మిషన్ తీసుకున్న ఇద్దరు ఆరు, ఎనిమిదో తరగతి విద్యార్థులు సోమవారం రాత్రి హాస్టల్ గోడ దూకి పారిపోయారు. వారిని మండలకేంద్రంలో గుర్తించి తిరిగి వార్డెన్‌కు అప్పగించారు. హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు.

ఇరువర్గాలపై కేసు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): భూ సమస్యపై గొడవపడగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన ఏరుకొండ సరోజన, భర్త తిరుపతి, కరీంనగర్ జిల్లా చర్లబూత్కూర్‌కు చెందిన బుర్ర రేణుక, భర్త రాములు, అల్లిపూర్‌కు చెందిన బండ రాణి, భర్త భూమయ్య, రేగడిమద్దికుంటకు చెందిన ముంజాల అశోక్, ఏరుకొండ వినోద్‌తోపాటు మరోవర్గం ముంజల శ్యామల, భర్త సతీశ్ భూసమస్యపై మంగళవారం గొడవ పడ్డారు. ఇదేసమయంలో పెట్రోలింగ్‌కు వెళ్లిన బ్లూకోల్ట్స్ సిబ్బంది వారిని సముదాయించినా వినకుండా పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. బుధవారం ఇరువర్గాలను సీఐ సుబ్బారెడ్డి ఠాణాకు పిలిపించి నోటీసులు అందించారు. గొడవ పడొద్దని కౌన్సెలింగ్ ఇస్తుండగా, ఏరుకొండ వినోద్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించి, అసభ్యపదజాలంతో దూషించాడు. దీంతో వినోద్‌పై కేసు నమోదు చేశారు. ఈ విషయమై సీఐని సంప్రదించగా భూసమస్యపై ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.



కిటకిటలాడిన రాజన్న క్షేత్రం

వేములవాడ: రాజన్నకు శ్రావణమాసం భక్తుల రద్దీ పెరిగింది. బుధవారం 15 వేల మంది దర్శించుకున్నారు. దీంతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. భక్తుల ఏర్పాట్లను ఈవో రాధాబాయి, ఏఈవోలు, పర్యవేక్షకులు పరిశీలించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి కోడె మొక్కు చెల్లించుకున్నారు. పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ ఆయనకు శేషవస్త్రం కప్పి, స్వామివారి ప్రసాదం అందించారు.



డాబాపై కూరగాయల సాగు

- రసాయనాలు లేని ఆకుకూరలు, కూరగాయలు
- అవగాహనతో ఆరోగ్యం కాపాడుకుంటున్న జనం


ఇంటిపై పండిస్తున్న కూరగాయలు

జగిత్యాలఅగ్రికల్చర్: రసాయనాల నుంచి తప్పించుకునేందుకు చాలామంది పట్టణవాసులు ఇంటిపై.. ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు పండించుకుంటున్నారు. తద్వారా ఆరోగ్యమైన ఆహారం పొందడంతోపాటు మనస్సుకు ఆనందం, ఆహ్లాదం అందించుకుంటున్నారు. గృహిణులు ఒకప్పుడు ఖాళీ ప్రదేశాల్లో పువ్వులు, అలంకరణ మొక్కలకు ప్రాధాన్యమిస్తే.. ఇప్పుడు రోజువారీ ఆహారంలో ఉపయోగించే ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు.

➡ ఆహ్లాదకర వాతావరణంలో..

కూరగాయలు పండిస్తున్న రైతులు ఎక్కువగా క్రిమిసంహారక మందులు వినియోగిస్తుండటంతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. కొందరు వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి రసాయనాలు లేకుండా.. ఇంటికి అవసరమైన కూరగాయలను ఇంటి డాబాపై, ఖాళీ ప్రదేశాల్లో పండించుకునేందుకు గృహిణులు ముందుకొస్తున్నారు. ఇంటి వాతావరణం మారిపోవడంతోపాటు చల్లని గాలి, పచ్చని మొక్కల మధ్య సేద తీరుతున్నారు.

➡ తేలికపాటి కుండీల ఎంపిక

డాబాపై కూరగాయల పెంపకానికి తేలికపాటి కుండీలను ఎంపిక చేసుకుంటున్నారు. ప్లాస్టిక్ కుండీలు, ఫైబర్‌తో తయారు చేసిన గ్రోబ్యాగ్స్ ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ బకెట్లు, వాటర్ క్యాన్లు, సింక్ తొట్టీలు, పాత టైర్లు.. ఇలా అన్నింటిని కూరగాయల పెంపకానికి ఎంపిక చేసుకుంటున్నారు. నిటారుగా ఉండే అంతస్తుల కుండీలు, వేలాడేదీసే కుండీలను కూడా వాడుకోవచ్చు. ఇనుపకుండీలైతే మొక్క వేరు వ్యవస్థ దెబ్బతింటుంది. లోతు వేరు వ్యవస్థ గల మొక్కలకు ఎక్కువ లోతు కుండీలు.. తక్కువ వేరు వ్యవస్థ గల మొక్కలకు తక్కువ లోతు కుండీలను ఎంచుకోవాలి. బొప్పాయి, అరటి వంటి పెద్ద మొక్కలకు పెద్ద పరిమాణం గల ప్లాస్టిక్ డ్రమ్ములను ఉపయోగించవచ్చు.

➡ గ్రోబ్యాగ్స్ అనుకూలం

గ్రో బ్యాగ్స్.. తక్కువ బరువు ఉండి, డాబాపై కూరగాయల పెంపకానికి అనుకూలంగా ఉంటాయి. ఎంచుకున్న మొక్కలకు అనుగుణంగా గ్రోబ్యాగ్స్ వినియోగించాలి. మార్కెట్లో వివిధ పరిమాణాలు, ఆకారాల్లో దొరుకుతాయి. వీటిలో మట్టి పరిమాణం తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలి. మట్టి మిశ్రమం అధికంగా ఉంటే డాబాపై బరువు పెరుగుతుంది. ఎర్రమట్టి, కోకోపీట్, పశువుల ఎరువు లేదా వర్మి కంపోస్టు వంటి తేలికపాటి మట్టి మిశ్రమాన్ని తయారు చేసుకుని కుండీల్లో నింపాలి. మార్కెట్లో రెడీమేడ్ కుండీ మిశ్రమం కూడా దొరకుతోంది. మట్టి మిశ్రమాన్ని నింపేటప్పుడు పైభాగంలో కొంత ఖాళీ వదలాలి,

➡ మొక్కల ఎంపిక ప్రధానం

డాబాపై మొక్కల పెంపకానికి కూరగాయల ఎంపిక ప్రధానం. కాలానుగుణంగా పండే కూరగాయలను ఎంపిక చేసుకోవాలి. శీతాకాలంలో దాదాపుగా అన్ని రకాల కూరగాయలను పండించవచ్చు. వేసవిలో క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యారెట్, ఆలుగడ్డ మినహాయించి మిగతా కూరగాయలు పండించవచ్చు. తీగజాతి వాటికి పందిరి వేసుకోవాలి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవడానికి షేడ్‌నెట్ వేసుకోవాలి. ఈ పద్ధతిలో కుటుంబ అవసరాలకు అనుగుణంగా నాలుగు రకాల కూరగాయలు, రెండు లేదా మూడు రకాల ఆకుకూరలు పండించవచ్చు.

➡ నీటి యాజమాన్యం కీలకం

దాబా తోటల్లో నీటిని క్యాన్ ద్వారా అందించవచ్చు. స్వయంగా మొక్క వయస్సు, ఎదుగుదలను బట్టి ఎంత నీరు అవసరముంటే అంత నీరు ఇవ్వవచ్చు. ఇంట్లోని వ్యర్థాల నుంచి కంపోస్టు తయారు చేసి మొక్కలకు పోషకాలు అందించవచ్చు. మొక్కల సంఖ్య తక్కువగా ఉంటుంది కాబట్టి చీడపీడలు వస్తే చేతి ద్వారా తీసివేయవచ్చు. తీగజాతి కూరగాయల్లో పండు ఈగ వస్తే లింగాకర్షక బుట్టలు వాడి నివారించవచ్చు. ఎక్కువ చీడపీడలు వస్తే వేప నూనెను లీటర్ నీటికి 5 మి.లీ పిచికారీ చేస్తే సరిపోతుంది.


జగిత్యాలలో ఇంటిపై కూరగాయలతో గృహిణి జ్యోతి

కొన్నేళ్లుగా సాగు చేస్తున్న



కొన్నేళ్లుగా ఇంటి పరిసరాలతోపాటు డాబాపై కూరగాయలు సాగు చేస్తున్నాను. మార్కెట్‌కు వెళ్లే అవసరం లేకుండాపోయింది. పూత నుంచి పిందె, కాత వరకు జరిగే చర్యలు కూడా ఆసక్తికరంగా ఉంటుండటంతో ప్రతిరోజు ప్రతి మొక్కనూ పరిశీలిస్తాను.

– సముద్రాల జ్యోతి, గృహిణి, జగిత్యాల

చాలా కూరగాయలు పెంచొచ్చు



ఇంటి ఖాళీ ప్రదేశాలు, డాబాలపై కూరగాయలు పెంచుకోవచ్చు. ఆసక్తి గల గృహిణులు గ్రూపుగా ముందుకొస్తే ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తాం. కొత్తిమీర, పాలకూర వంటి ఆకుకూరలతోపాటు చిన్నపాటి సంచుల్లో టమాట, మిర్చి వంటి కూరగాయలు సాగు చేయవచ్చు. మా శాఖ తరఫున అవగాహన కల్పిస్తున్నాం.

– స్వాతి, ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

ఏసీబీకి చిక్కిన పీఆర్ ఏఈ

- రూ.7వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌తో డబ్బుల డిమాండ్
- ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ వెల్లడి


ఏసీబీకి పట్టుబడిన ఏఈ అనిల్


ఏసీబీకి పట్టించిన బాధితుడు వెంకటేశ్

జగిత్యాలక్రైం: ప్రభుత్వ పనులు చేపట్టిన సివిల్ కాంట్రాక్టర్‌కు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేసిన జగిత్యాల పంచాయతీ రాజ్ శాఖలో విజిలెన్స్ క్వాలిటీకంట్రోల్ విభాగం ఏఈ అనిల్ బుధవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లికి చెందిన పంచరి వెంకటేశ్ సవిల్ కాంట్రాక్టర్. ఐదేళ్ల క్రితం కోరుట్లలో రూ.13.80 లక్షలతో ఎల్లమ్మ (గౌడ) కమ్యూనిటీ హాల్ నిర్మించాడు. ఎంబీ రికార్డు కూడా పూర్తయింది. అలాగే రెండేళ్ల క్రితం రూ.4.50 లక్షలతో చిన్నమెట్‌పల్లిలో హనుమాన్ కమ్యూనిటీ హాల్ నిర్మించాడు. కోరుట్లలోని ఆర్డీవో కార్యాలయం ప్రహరీని రూ.5లక్షలతో పూర్తి చేసి ఎంబీ రికార్డు పూర్తి చేయించాడు. మొత్తం మూడు పనులను రూ.23.30లక్షలతో పూర్తి చేశాడు. వాటికి సంబంధించిన బిల్లుల కోసం ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఏఈ అనిల్‌కుమార్‌ను కొన్నాళ్లుగా కోరుతున్నాడు. రేపుమాపు అంటూ కాలం వెళ్లదీస్తూ వచ్చిన అనిల్.. గత శనివారం రూ.18 వేలు డిమాండ్ చేశాడు. దీనికి వెంకటేశ్ రూ.10 వేలు ఇచ్చేందుకు ఒప్పుకుని అదేరోజు రూ.3వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. అనంతరం ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ అధికారులు బుధవారం సాయంత్రం కరీంనగర్‌రోడ్‌లో ఉన్న పంచాయతీరాజ్ శాఖ విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం వద్ద కాపుకాశారు. వెంకటేశ్ నుంచి అనిల్ రూ.7వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేశారు. అనిల్‌ను కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరు 1064లో సంప్రదించాలని డీఎస్పీ వివరించారు. దాడుల్లో ఏసీబీ సీఐలు పున్నం చందర్, కృష్ణకుమార్, తిరుపతి, సిబ్బంది శ్రీకాంత్, విష్ణు, బాలు, మొగిలయ్య పాల్గొన్నారు.

కొడుకు, కోడలు మధ్య మనస్పర్థలు

- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య
- జలవిద్యుత్ కేంద్రంలో బలవన్మరణం


రాజన్న(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): తన కొడుకు, కోడలు మధ్య మనస్పర్థలు తలెత్తాయనే మనస్తాపంతో జెన్‌కో ఉద్యోగి మేడుదుల రాజన్న (49) బుధవారం తను పనిచేస్తున్న జలవిద్యుత్ కేంద్రం లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సనత్ కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లికి చెందిన రాజన్న జూలపల్లి మండలం కాచాపూర్ 14వ మైలురాయి వద్ద గల జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కుమారుడు సాయికుమార్, ఒక కూతురు ఉన్నారు. సాయికుమార్ 2020లో మేకల కావ్యను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి కుమారుడు(3) ఉన్నాడు. అయితే, ఎంబీఏ చదువుకునేందుకు సాయికుమార్ 2022లో యూకేకు వెళ్లాడు. ఆ తర్వాత ఆయన భార్య కావ్య తనతల్లిదండ్రుల వద్దకు వెళ్లి అక్కడే ఉంటోంది. 2024లో ఇండియాకు తిరిగి వచ్చిన సాయికుమార్.. తన భార్యను కాపురానికి రమ్మని అనేకసార్లు కోరినా ఆమె తిరస్కరించింది. దీంతో వారి మధ్య మనస్పర్థలు ఏర్పడి పంచాయితీలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే తన కుమారుడి సంసారం సాఫీగా సాగడం లేదనే మనస్తాపానికి గురైన తండ్రి రాజన్న.. తను పనిచేస్తున్న జలవిద్యుత్ కేంద్రంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేశారు.

మతోన్మాదం రేపడమే బీజేపీ లక్ష్యం

- కాంగ్రెస్ ఓబీసీ జాతీయ కన్వీనర్ హనుమంతరావు


రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హనుమంతరావు, నాయకులు

సిరిసిల్లటౌన్: దేశంలో మతోన్మాదం రేపుతూ, ఓట్లు దండుకోవడమే బీజేపీ లక్ష్యమని కాంగ్రెస్ ఓబీసీ జాతీయ కన్వీనర్ వి.హన్మంతరావు అన్నారు. బీసీల కులగణన చేయాలని ఉద్యమిస్తున్న రాహుల్ గాంధీ ఆకాంక్షను హర్షిస్తూ బుధవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకు కులగణన జరగలేదని, బీసీలకు అనేక బాధలు ఉన్నాయని, ఒక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తాము ప్రధాని మోదీని కోరినా పట్టించుకోలేదన్నారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే బీసీ కులగణన జరగాలని రాహుల్‌గాంధీ ప్రగాఢంగా నమ్మి ఆ దిశగా ఉద్యమిస్తున్నారని, ఇందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. దేశంలో యాభైశాతం రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తారని ఇది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌కు తగ్గట్టుగా అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ముస్లిం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ హిందూదేశంగా మార్చాలని కుట్రపూరితంగా ఉన్నాయన్నారు. బీసీ కులగణన కోసం ఆగస్టులో జంతర్‌మంతర్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, గడ్డం నరసయ్య, ఆకునూరి బాలరాజు, సూర్య దేవరాజు, వెలుముల స్వరూపరెడ్డి, బొప్ప దేవయ్య, రాపల్లి కళ్యాణ్, గుండ్లపెల్లి గౌతమ్, ఆడెపు చంద్రకళ, మడుపు శ్రీదేవి, కల్లూరి చందన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసుల్లో ఇద్దరికి జైలు, జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామానికి చెందిన కంకణాల శ్రీనివాస్, ధర్మారం మండలం గోపాలరావుపేటకు చెందిన సందనవేని లక్ష్మణ్‌ను విద్యుత్ చౌర్యం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సాదుల్లా బాబా తెలిపారు. ఇరువురూ తమ ఇంటికి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్‌ను వాడుతుండగా కేసు నమోదు చేసి మొదటి నేరం శ్రీనివాస్‌కు రూ.వేయి, లక్ష్మణ్‌కు రూ.3 వేలు జరిమానా విధించి వదిలేయడం జరిగిందన్నారు. మరోసారి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. విచారించిన పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సునీత కుందాల నిందితులైన శ్రీనివాస్‌కు రూ.6,482, లక్ష్మణ్‌కు రూ.13,727 జరిమానాతో పాటు మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సైలు బి.ఓంకార్ యాదవ్, కె.కళ పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానుల బైండోవర్


ట్రాక్టర్ యజమానులకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు వాగునుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మహేశ్, అశోక్‌ను బుధవారం తహసీల్దార్ రాజేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మరోసారి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే రూ.లక్ష జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించేలా సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు వివరించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ గోదాంగడ్డకు చెందిన బోయిని రాజేశ్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పట్టుకుని బుధవారం బాధితుడికి అప్పగించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. జనవరి 6న మొగ్దుంపూర్‌లో రాజేశ్ సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో నిజామాబాద్‌లో గుర్తించి పట్టుకున్నట్లు వివరించారు.

నమ్మించి.. గొంతుకోసి

- వృద్ధురాలిపై మహిళ హత్యాయత్నం
- బంగారం, నగదు కోసం ఘాతుకం


ప్రమీల గొంతుపై గాయాలు

సైదాపూర్: 'నా భర్తతో గొడవ జరిగింది. ఈ రాత్రికి మీ ఇంట్లో పడుకుంటాను' అంటూ ఓ వృద్ధురాలిని నమ్మించింది. వృద్ధురాలు నిద్రపోయాక, హత్యాయత్నం చేసింది. ఆపై బంగారం, నగదుతో ఉడాయించిందో మహిళ. ఈ ఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితురాలి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రావుల ప్రమీల(70) ఒంటరిగా ఉంటోంది. పెద్ద కొడుకు రావుల రాజిరెడ్డి కరీంనగర్‌లో, చిన్న కొడుకు దేవేందర్‌రెడ్డి సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన మిట్టపల్లి స్వరూప(50) మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రమీల ఇంటికి తరుచూ వచ్చి మాట్లాడుతోంది. రాత్రి పూట కూడా వచ్చింది. భర్తతో గొడవ జరిగిందని, రాత్రికి మీ ఇంట్లోనే పడుకుంటానని నమ్మబలికింది. ప్రమీల నిద్రపోయిన తర్వాత దిండుతో ముఖంపై అదిమిపట్టింది. కత్తితో గొంతు, శరీరభాగాలపై గాయపరిచింది. చనిపోయిందని అనుకుని వృద్ధురాలిపై ఉన్న బంగారం, నగదుతో పారిపోయింది. బుధవారం వేకువజామున స్పృహ వచ్చిన ప్రమీల చిన్న కొడుకు దేవేందర్‌రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే ఇంటికి వచ్చిన కొడుకులిద్దరూ వృద్ధురాలిని ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితురాలు కూడా పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

గొల్లపల్లి: చదువు ఇష్టం లేక మనస్తాపంతో ఈనెల 25న క్రిమి సంహారక మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గోవిందుపల్లికి చెందిన బోనగిరి సూర్య బుధవారం మృతిచెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. సూర్యను ఇంటర్ చదువు నిమిత్తం తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. అక్కడ చదువుకోవడం ఇష్టం లేక ఇంటికి వచ్చాడు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో ఈనెల 25న ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. వెంటనే తల్లిదండ్రులు అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సూర్య తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాంట్రాక్టు కార్మికులపై పట్టింపేది?

- ఈఎస్‌ఐ సేవలకు దూరం
- పట్టించుకోని యాజమాన్యం, కార్మిక సంఘాలు

- కమాన్‌పూర్ మండలం పిల్లిపల్లెకు చెందిన పిట్టల రమేశ్ సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు. ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచిపడి మృతి చెందాడు. దీంతో మృతుడి భార్యకు కార్మిక రాజ్యబీమా(ఈఎస్‌ఐ) సంస్థ ద్వారా ప్రతినెలా రూ.7,400 పింఛన్ మంజూరవుతోంది.
- కమాన్‌పూర్ ప్రాంతానికి చెందిన బండ అర్జయ్య సింగరేణి ఓసీపీ–1 జరిగిన పేలుడులో చనిపోయాడు. ఈఎస్‌ఐ సభ్యత్వం ఉండడంతో అతడి కుటుంబానికి ప్రతినెలా రూ.13,681 పింఛన్ వస్తోంది.


విధుల్లో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీం ఆఫ్ ఇండియా(ఈఎస్ఐసీ) సౌకర్యం అందని ద్రాక్షే అవుతోంది. సంస్థలో సుమారు 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. రామగుండం ప్రాంతంలోనే దాదాపు 10వేల మందికిపైగా పనిచేస్తున్నారు. వీరిలో కేవలం 600 మందికే ఈఎస్‌ఐ సౌకర్యం ఉంది. సింగరేణి యాజమాన్యం చొరవ చూపితేనే వీరు ఈఎస్‌ఐ సౌకర్యం పొందే వీలుంది. ఇలాంటి వారికే ఉచితంగా వైద్య సౌకర్యం అందుబాటులోకి వస్తాయి. ఏదైనా కారణంతో శాశ్వత అంగవైకల్యానికి గురైనా, మృతి చెందినా అనేక ప్రయోజనాలు వర్తిస్తాయి.

అనేక విభాగాల్లో..

సింగరేణిలోని స్వీపింగ్, హౌస్‌కీపింగ్, తోటమాలి, సివిల్, సివిక్, సేల్ పిక్కింగ్, బెల్ట్ క్లీనింగ్, షాంప్లింగ్, కన్వేయన్స్ వాహనాలు.. ఇలా పలు విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతినెలా ఒక్కోకార్మికుడికి రూ.21 వేల వేతనం ఉంటుంది. అయినా, వీరిని ఈఎస్‌ఐ సౌకర్యం వరించడంలేదు.

ఈఎస్ఐసీ వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగులకు సామాజిక, ఆర్థిక రక్షణ అందించే సామాజిక భద్రత పథకం. ఉద్యోగులకు అనారోగ్యం, ప్రసూతి, వైకల్యం, పని సమయంలో ప్రమాదాలతో ఏర్పడే గాయాలు, మృతి వంటివి సంభవిస్తే ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులకూ ఉచిత వైద్యం అందిస్తుంది.

వీరే అర్హులు..

పది లేదా అంతకన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు, కర్మాగారాలు, దుకాణాలు, కార్యాలయాల్లో ఆఫీసుల్లో పనిచేస్తూ నెలకు రూ.21 వేలు అంతకన్నా తక్కువ వేతనం ఉన్న వారు ఈఎస్ఐసీకి అర్హులు. ఇలాంటి వారిని ఈఎస్ఐసీ కింద నమోదు చేయడం సంస్థ యజమాని బాధ్యత. ఈపథకంలో చేరే ఉద్యోగి వేతనంలో 3.25శాతం యజమాని, 0.75శాతం ఉద్యోగి సమానమైన మొత్తాన్ని చందాగా జమచేస్తారు.

మెటర్నిటీ బెనిఫిట్:

➡ 26 వారాల పాటు మెటర్నిటీ బెనిఫిట్ లభిస్తుంది. వైద్యుడి సలహాపై మరో నెల పొడిగించుకోవచ్చు. పూర్తి వేతనం వస్తుంది.

రామగుండం ఈఎస్‌ఐ డిస్పెన్సరీ పరిధిలో కాంట్రాక్టు కార్మికులు	
ఎన్టీపీసీ	9,600
రామగుండం బల్దియా	800
కేశోరాం	1,200
ఆర్ఎఫ్‌సీఎల్	1,900
సింగరేణి	600

తాత్కాలిక వైకల్యం:

➡ ఉద్యోగంలో ఉన్నప్పుడు గాయపడితే కాంట్రిబ్యూషన్‌తో సంబంధం లేకండా అంగవైకల్యం కొనసాగినంతకాలం వేతనంలో 90శాతం చెల్లిస్తారు.

శాశ్వత అంగవైక్యం:

మెడికల్ బోర్డు ధ్రువీకరణపై ప్రమాదంతో సంపాదన సామర్థ్యాన్ని కోల్పోయిన స్థాయిని బట్టి వేతనంలో 90శాతం ప్రయోజనం చెల్లిస్తారు.

డిపెండెంట్ బెనిఫిట్:

ఉద్యోగంలో గాయం లేదా వృత్తిపరంగా ప్రమాదంతో మరణం సంభవిస్తే ఉద్యోగిపై ఆధారపడిన వారికి జీతంలో 90శాతం డిపెండెంట్‌కి చెల్లిస్తారు.

ఇతర ప్రయోజనాలు:

➡ ఉద్యోగి మరణిస్తే ఖర్మల కోసం రూ.15వేలు చెల్లిస్తారు
➡ ఈఎస్‌ఐ ఉన్న మహిళ లేదా సభ్యుడి భార్య.. ఈఎస్‌ఐ కింద తగిన వైద్య సేవలు అందుబాటులో లేనిప్రదేశంలో ఉంటే కన్‌ఫైన్‌మెంట్ ప్రయోజనాన్ని అందజేస్తారు.

వైద్య ప్రయోజనాలు..

➡ కుటుంబసభ్యులకు కార్పొరేట్‌స్థాయి వైద్యం
➡ కాంట్రిబ్యూషన్‌తో సంబంధం లేకుండా అందరికీ ఒకేరకమైన వైద్యం
➡ చికిత్సకు అయ్యే ఖర్చుపై గరిష్ట పరిమితి లేదు
➡ రిటైర్డ్, శాశ్వత వికలాంగులు, జీవిత భాగస్వామ్యులకు టోకెన్ ప్రీమియం రూ.120 చెల్లింపుపై వైద్య సంరక్షణ వర్తిస్తుంది.

అనారోగ్య ప్రయోజనాలు..

➡ ధ్రువీకరించిన కొన్ని వ్యాధులకు సిక్‌లీవ్ తీసుకోవచ్చు
➡ ఏడాదిలో 91రోజుల పాటు ఈ సెలవులు తీసుకునే అవకాశం ఉంది
➡ అనారోగ్యకాలంలో సిక్ బెనిఫిట్ కింద నగదు రూపంలో పరిహారం ఇస్తారు
➡ కార్మికుడి వేతనంలో 70శాతం చొప్పున పరిహారం ఉంటుంది
➡ ఈ ప్రయోజనం కోసం ఆర్నెల్లలో కనీసం 78రోజులు కాంట్రిబ్యూట్ చేయాలి